# సర్కస్ సింహాలు

## వసుంధర

**భూపతి హోంమినిష్టరై మూడు సంవత్సరాలయింది. ఈమూడు సంవత్సరాలోనూ రాష్ట్రంలో శాంతి నెలకొన్నదనేచెప్పవచ్చును. మాఊళ్ళో జరిగిన బంద్ విజయంకావడం చాలామందికిఆశ్చర్యాన్ని కలిగించింది.**

■ కొత్తపార్టీలు వచ్చినపుడు, కొత్త నాయకులు ఎన్నికైనప్పుడు ప్రజల్లో ఒక రకమైన కొత్త ఉత్సాహం బలరేగుతుంది. ఒక్క రాత్రిలో ప్రపంచం మారిపోతుందనీ తమ సమస్యలకు పరిష్కారమార్గాలు వెతుక్కుంటూ వచ్చేస్తాయని ప్రజలు భావిస్తారు యుగ యుగాల అనుభవం కూడా వారిని ఉత్సాహంనుంచీ, భావన నుంచీ ఆపలేదు

నేనొక కొత్త నాయకుడిని.

నా గురించి నాకు తెలుసు ప్రజల గురించిన పైరహస్యమూ నాకు తెలుసు ఎలాచ్చీ ప్రజలకే నా గురించి తెలియదు తెలిసినా వారు నా గురించి పట్టించుకోరు. అందుకే నిర్భయంగా నా కథను నేను చెప్పుకోగలను. ఆ కథ నాది అని మాత్రం చెప్పను

ఎందుకంటే ఎదురుగా అద్దం ఉంచితే అందులో కనబడేది తన ప్రతిబింబమని గుర్తించలేని స్థితిలో సామాన్య మానవుడున్నాడు నేను, నా కథ పక్కపక్కన ఉంటే-నేను చెప్పుకునే వరకూ ఆ రెంటికీ ఏదో సంబంధమున్నదని కూడా గ్రహించలేని అజ్ఞాని సామాన్య మానవుడు.

అశ్వత్థామ హతః అని గట్టిగా అరచి తను నిజం చెప్పానన్న సంతృప్తిని తనకు మిగుల్చుకొనడం కోసం మాత్రం కుంజరః అన్నాడు ధర్మజుడు ఇది రాజనీతి ఇదే రాజనీతిని ఉపయోగించి నా అంతరాత్మ పెట్టే పోరు భరించలేక నా కథను బైట పెట్టదల్చుకున్నాను. నా స్థానాన్ని ప్రజల్లో కాపాడుకొనడం కోసం దాన్ని నా కథగా మాత్రం చెప్పుకొనడంలేదు

నేనొక కొత్త నాయకుడిని! ఒక కొత్త నాయకుడు మన దేశంలో ఎలా ఉద్భవిస్తున్నాడో తెలుసుకొనడానికి నా కథ ఉపయోగిస్తుంది. నా కథను చదివి ఆనందించండి తప్పితే నేనెవరో నని ఆలోచించవద్దు ఎందుకంటే నేను ఒకరు కాదు ఇద్దరు కాదు ఎందరో! నా పేరు మరుగున ఉంచినా నా కథ చదవగానే మీ మనసులో ఎన్నో పేర్లు మెదులుతాయి

ఇంక నా కథ ప్రారంభిస్తాను.

నేను కాలేజీలో చేరినపుడు నాన్న అన్నాడు "ఇంత వరకూ ఏదో పరీక్షలు పాసయ్యావు కదా అని తెలివైన వాడిని అనుకోకు. తెలివైన వాడివైతే ఏ ఇంజనీరింగ్ కాలేజిలోనో, మెడికల్ కాలేజిలోనో చేరవలసిన వాడివి ఈ కాలేజీలో నైనా నీకు సైన్సు గ్రూపులో సీటురాలేదు అందుకే బియ్యేలో చేరావు ఈ బియ్యేలో ఎంత బాగా చదివినా నువ్వు పైకి పోవడం కష్టం. పేరు తెచ్చుకొనడం కష్టం. అందుకే ఏ మాత్రం వీలున్నా రాజకీయాల్లో ప్రవేశించు నాకు చిన్నప్పటినుంచీ నీ గురించి తెలుసు నువ్వు రాజకీయాల్లో పైకి వస్తావు-"

నాన్నకు రాజకీయాలంటే చాలా ఇష్టం. చిన్నతనంలో ఆయనకు చదువు సరిగా రాలేదు తను రాజకీయాల్లో రాణిస్తానని ఆయన నమ్మకం కానీ తాతగారాయనకు చాలా బాధ్యతలు అంటగట్టారు అన్ని బాధ్యతలతో రాజకీయాల్లో ప్రవేశించడం మంచిది కాదని నాన్న అనుకున్నాడు రాజకీయాలు బాధ్యతారాహిత్యాన్ని నేర్పుతాయి వాటిలో నిలదొక్కుకుని పైకి పోవడానికి కొంతకాలం పడుతుంది. అలాగా తన సంసారం రోడ్డున పడివచ్చు

బయట చేయలేని పని ఆఫీసులో చేశాడు నాన్న తన రాజకీయ చాతుర్యాన్నుపయోగించి డబ్బు బాగానే సంపాదించాడు తాతగారప్పగించిన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వహించడమేకాక తానిప్పుడు సుఖజీవనం గడుపుతున్నాడు. నాకు ఇద్దరన్నలు. అక్కలిద్దరు. అందరికీ పెళ్ళిళ్ళైపోయాయి జీవితంలో హాయిగా స్థిరపడ్డారు.

"నీకే బాధ్యతలూ లేవు పరీక్షలు పాసు కాకపోయినా కాలేజీనుంచి డిబారయినా నీ గురించి బాధపడను ఎలాగో అలా రాజకీయ వాదిని కావడానికి నీ సర్వశక్తులూ క్రోడీకరించు. ఇందుకు కాలేజీయే మొదటి మెట్టు

ఇదీ నాన్న నాకు తరచుగా ఇచ్చే సందేశం. ఈ సందేశం నా మీద బాగానే పనిచేసింది

కాలేజీలో చేరగానే ఓ వారం రోజుల్లో లెక్చరర్లతో గొడవ పెట్టుకున్నాను. వాళ్ళలో ఓ అమాయకుణ్ణి బాగా రెచ్చగొట్టి "యూ ఫూల్ గెటౌట్" అనిపించుకున్నాను అపైన విద్యార్థులను రెచ్చగొట్టి సమ్మె చేయించాను.

అప్పుడే నాకు అర్థమయింది - విద్యార్థులను రెచ్చగొట్టడం చాలా సులభమని!

ఆ సమ్మె నాకు విద్యార్థి లోకంలో మంచి పేరు తెచ్చిపెట్టింది.

కాలేజీ హాస్టల్లో నిర్వాహక వర్గం అవినీతి గురించి చిన్న దుమారం రేగింది. దానిని నేను సమ్మెగా మార్చాను హాస్టలు నిర్వాహక వర్గం మారింది సమ్మె విరమించుకున్నాం

కాలేజీలో ఏ చిన్న సమస్య వచ్చినా గోరంతలు కొండంతలుగా చేసి విద్యార్థులను రెచ్చగొట్టేవాణ్ణి నాకు నాన్న రక్షణ ఉన్నది కాబట్టి-చాలా నిర్భయంగా ఉండేవాణ్ణి మొదటి సంవత్సరంలోనే నేను విద్యార్థి నాయకుడిగా గుర్తించబడ్డాను. నాకు "విద్యార్థి బంధువు" - అన్న బిరుదు కూడా వచ్చింది కాస్త పేరున్న ప్రతివాడికీ బిరుదులివ్వడం ఈనాటి సంప్రదాయం కదా!

నాన్న అనుకున్నట్లు నన్ను కాలేజీనుంచి డిబార్ చేసే ప్రయత్నాలేమీ జరగలేదు. కాలేజీలోని లెక్చరర్సందరూ ప్రిన్సిపాలును మించి నన్ను గౌరవించేవారు ప్రిన్సిపాలు కూడా కాలేజీ అడ్మినిస్ట్రేషనుకు సంబంధించిన కొన్ని ముఖ్య వ్యవహారాల్లో నిర్ణయాలు తీసుకునే ముందు ఒకసారి నన్ను కూడా పిలిచి సంప్రదిస్తూండేవాడు పరీక్షల్లో నేను కాపీ కొడితే ఇన్విజిలేటర్సు చూసీ చూడనట్లూరుకునేవారు

అవన్నీ నాన్నకు గర్వంగా చెప్పుకునేవాణ్ణి ఆయన ఆనందంగా తలూపుతూ నా మాటలు వినేవాడు. కానీ నన్ను ప్రత్యేకంగా మెచ్చుకోవడం బియ్యే రెండవ సంవత్సరంలోనికి వచ్చేక జరిగింది

అప్పుడు నన్ను ఊళ్ళోని కొందరు ప్రతిపక్ష నాయకులు పిలిచి—ఊళ్ళో తాము ఏర్పాటు చేస్తున్న బంద్‌కు విద్యార్థుల సహకారం అందేలా చూడమని చెప్పి—వెయ్యి రూపాయలు ఖర్చుం కుంచమని ఇచ్చారు

ఆ రోజు నాన్న నన్ను తెగమెచ్చుకున్నాడు డబ్బు సంపాదించినందుకేమోనని ముందు అనుకున్నాను కానీ నాన్న ఆ డబ్బు తీసుకోలేదు- నువ్వు రాజకీయనాయకుడను అనిపించగలిగావు. అదే చాలా నిలిసింది" అన్నాడాయన



సెల్వరాజ్

హోటలు ధరలు పెరిగినందుకు నిరసనగా ఊళ్ళో బంద్ జరిగింది అందులో ఊళ్ళోని విద్యార్థులందరూ పాల్గొన్నారు. బంద్ చాలా అద్భుతంగా జరిగింది ఈ సమయంలో నేను మా ఊరి విద్యార్థి లోకానికంతకూ నాయకుడిగా గుర్తించబడ్డాను నాయకత్వానికి అవసరమైన ఉపన్యాసాలు నా నోటినుంచి ధారాళంగా వెలువడే శక్తి భగవంతుడు నాకిచ్చాడు.

ప్రతిపక్ష రాజకీయనాయకులు నన్ను తరచుగా కలుసుకోసాగారు దేశంలోని రాజకీయాలను వాళ్ళు నాతో చర్చిస్తూంటే నాకెన్నో కొత్త విశేషాలు తెలుస్తున్నాయి అంతకుమించి—ఆ రాజకీయవాదులు నన్ను వాళ్ళతో సమానం చేసి మాట్లాడినందుకు నాకు చాలా సంతోషంగా ఉండేది.

అఖిలాంధ్ర పరిషత్తునుంచి నాకో ఆహ్వానం వచ్చింది మా ఊళ్ళో జరిగిన బంద్ నాకు చాలా మంచి పేరు తెచ్చి పెట్టిందనడానికిదొక నిదర్శనం.

రాష్ట్రం మొత్తంమీద పాతిక మంది ముఖ్య విద్యార్థినాయకులతో నేనొకడిని తేలాను మేమందరమూ చర్చించిన దేమంటే...

రాష్ట్రంనిండా కాలేజీలు కుక్కగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కాలేజీలనుంచి బయటకు వచ్చే గ్రాడ్యుయేట్లకుద్యోగాలు కరువౌతున్నాయి ధరలు నానాటికి పెరిగి పోతున్నాయి. అవినీతి పెచ్చుమీరి పోతోంది.

ప్రత్యక్షంగానో - పరోక్షంగానో వీటన్నింటి వల్లా విద్యార్థులు నష్టపోతున్నారు విద్యార్థిలోకం వీటన్నింటినీ ప్రతిఘటించాలి అందుకు రాష్ట్రంలోని విద్యార్థులందరూ ఒక రోజున "ఆంధ్రా బంద్" రూపంలో తమ నిరసనను ప్రకటించాలి

నేను దీనికి అంగీకరించలేదు ఒకరోజు బంద్ ఏర్పాటు చేయడంవల్ల ప్రయోజనమేముంటుంది? లాఠీఛార్జి జరగడమూ, కొంతమంది జైలుకు వెళ్ళడమూ—ఆపైన అంతా మామూలే!

ముఖ్యంగా నాకు రాష్ట్ర హోంమంత్రి భూపతి అంటే చాలా భయం ఆయనకు భయమన్నది లేదని చెప్పుకుంటారు ప్రస్తుతమున్న రాజకీయ నాయకుల్లో నిస్వార్థపరుడూ, దేశరక్షకుడూ—ఆయనొక్కడేనని చాలామంది అంటారు. అల్లర్లు, కొట్లాటలు ఆయన ఏ మాత్రమూ సహించడు పిస్తోలు మీదనైనా బ్రహ్మాస్త్రం వేసి సమ్మెలను అణచివేసే భూపతిమీద ముఖ్యమంత్రికి కూడా అదుపులేదని చెప్పుకుంటారు

రాష్ట్ర స్థాయిలో బంద్ అంటే భూపతిని ఢీకొనడమే అవుతుంది.

భూపతి హోంమినిస్టరై మూడు సంవత్సరాలయింది ఈ మూడు సంవత్సరాలలోనూ రాష్ట్రంలో శాంతి నెలకొన్నదనే చెప్పవచ్చును మా ఊళ్ళో జరిగిన బంద్ విజయం కావడం చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగించింది అఖిలాంధ్ర విద్యార్థి పరిషత్తునుంచి నాకు ఆహ్వానం రావడానికి కూడా అదే కారణం!

"మనం ఏదో ఒకటి చేయాలి విద్యార్థిలోకం చచ్చుబడి పోయిందని అంతా అంటున్నారు..." అన్నారు కొందరు.

ప్రతి విద్యార్థి నాయకుడిదే ప్రోత్సహించడానికి రెచ్చగొట్టడానికి ఒక రాజకీయ హస్తం ఉంటుంది

మేము ఉద్యమం ప్రారంభిస్తే మా అందరికి ఆర్థికంగానూ, ఇతర విధాలుగానూ మంచి ప్రతిఫలం ఉంటుంది

నేను కాసేపు ఆలోచించి— "ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజి ఆఫీసులో ఎందరో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. వేలకు వేలమంది అలాగే పిల్పు కోసం ఎదురు చూస్తూ ఉండిపోతున్నారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో పేరు నమోదు చేయించుకున్న వారందరికీ సంవత్సరం లోపులో ఉద్యోగాలిప్పించాలని ఆందోళన ప్రారంభిద్దాం—" అన్నాను

ఈ విధమైన ఆందోళనకు రాజకీయ పక్షాల మద్దతు ఉంటుంది. నిరుద్యోగుల మద్దతు ఉంటుంది. ప్రజల సానుభూతి ఉంటుంది. ఈ ఆందోళనను అణచిపెట్టడం ఎలాగో తెలియక ప్రభుత్వం ఇరకాటంలో పడుతుంది

నేనిలాగన్న నాలుగు రోజులకు విద్యార్థిలోకం చేయదల్చుకున్న ఆందోళనగురించి వార్తాపత్రికల్లో వచ్చింది. ఆందోళన ప్రారంభించాలనుకుంటున్నది నేనేనని కూడా ఆ పత్రికలు రాశాయి

వార్త వచ్చిన కొద్ది క్షణాల్లో భూపతి ఆదేశం మీద పోలీసులు నన్ను అరెస్టు చేశారు సుఖంగా ఇంట్లో కూర్చున్నవాడిని జైలుపాలయ్యాను. నేను జైలుకు వెడుతూంటే అమ్మ ఏడ్చింది. చుట్టుపక్కల వాళ్ళు ఏడ్చారు నా క్లాసుమేట్స్ కొందరు ఏడ్చారు కాని నాన్న మాత్రం ఆనందపడ్డాడు.

నేను జైలుకి వెళ్ళిన అయిదురోజుల్లో నాకు చాలా తెలిసివచ్చాయి అక్కడ పోలీసులు మొదటిరోజు నన్ను బెదిరించారు బుద్ధిగా చదువుకోమని లేనిపోని రాజకీయాల్లో దిగవద్దని హెచ్చరించారు. రెండోరోజు వారి ప్రవర్తన మారింది. నన్ను గౌరవించడం మొదలుపెట్టారు మూడో రోజు నాకు చదువుకునేందుకు వార్తాపత్రికలు కూడా ఇచ్చారు. వాటిలో నాకు సంబంధించిన వార్తలు చూశాను

నన్ను తక్షణం విడుదల చేయాలని విద్యార్థి నాయకులు, ప్రతిపక్ష రాజకీయ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ విషయమై సానుభూతితో పరిశీలిస్తున్నామని, తనకు రెండు రోజులు గడువు ఇవ్వవలసిందని భూపతి వారిని కోరాడు.

పేపర్లో నన్ను గురించిన ప్రశంసలు చాలా కనబడ్డాయి. అవి చదువుతూంటే నాకు సిగ్గు వేసింది. దేశభక్తి నానరనరాలా ప్రవహిస్తున్నదట. ప్రజాక్షేమమే నా ధ్యేయమట. తుపాకి గుండుకు ఎదురునిలిచి మాట్లాడగల మొనగాడినట. విద్యార్థులకు ఆశాదీపాన్ని. రాష్ట్రంలో నాయకుల కొంతను నేను తీర్చబోతున్నానట.

అన్ని పార్టీలవారూ నన్ను పొగుడుతున్నారు నా సామర్థ్యాన్ని, నిస్వార్థపరత్వాన్ని, దేశభక్తిని, ధైర్యాన్ని, ప్రజాస్వామ్య పద్ధతులపై నాకున్న అచంచల విశ్వాసాన్ని.— అన్నింటినీ వారు పొగుడుతున్నారు

వాళ్ళవి ఎందుకు చేస్తున్నారో నాకు తెలుసు. అవన్నీ చదివి నేను ఉబ్బిపోతాను. నిరుద్యోగ సమస్యకు వ్యతిరేకంగా ఆందోళన ప్రారంభిస్తాను. ఆ ఆందోళన రాష్ట్రాన్నే కాదు—దేశాన్ని కూడా ఓ ఊపు ఊపవచ్చును.

అయితే నేను నిరుద్యోగ సమస్య గురించి వ్యథ చెందడంలేదు గుర్తింపుకోసం తాపత్రయ పడుతున్నాను

మంచికో చెడ్డకో. నాకు అయిదోరోజు జైలు జీవితం అనంతరం భూపతి నుంచి పిలుపు వచ్చింది పోలీసు ఇనస్పెక్టర్ నన్ను భూపతి వద్దకు తీసుకుని వెళ్ళాడు తర్వాత మేమిద్దరం గదిలో మిగిలాం.

భూపతి నా వంక చూశాడు. నేను భూపతి వంక చూశాను

నాకు భూపతి అంటే భయం !

ఇప్పుడు భూపతి నన్నేం చేస్తాడు ? నాకు ఎందరో ప్రముఖుల మద్దతు ఉంది. దానికి ఆయన భయపడతాడా ?

భూపతికి భయమన్నది లేదని చెప్పుకుంటారు ఆయన నన్ను హెచ్చరిస్తాడా ? జీవితంలో మరిచిపోలేని గుణపాఠాన్ని చెప్పేందుకు ఏర్పాట్లు చేస్తాడా ?

లేక నేనాశించిన విధంగా గుర్తింపు లభిస్తుందా?

భూపతి నా వంక చూస్తున్నాడు నేను భూపతి వంక చూస్తున్నాను నా చూపుల్లో భయముండి ఉండవచ్చునని నాకు తోస్తోంది.

ఈ విధంగా భూపతికి ఎదురు పడవలసి వస్తుందని తెలిస్తే నేను తగు జాగ్రత్తలో ఉండేవాణ్ణి

నిస్వార్థపరుడైన ప్రజానాయకుడు భూపతి. అతడి ఎదురుగా నిలువెల్లా స్వార్థంతో ప్రజానాయకుడిననిపించుకుంటున్న నేను నాకు తెలిసిన ఈ తేడాయే భూపతి అంటే నన్ను భయపెడుతున్నది.

భూపతి నన్ను సమీపించాడు. నాతో మాట్లాడడం ప్రారంభించాడు

* * *

మా సంభాషణ ముగిసేక నాకో జోక్ గుర్తొచ్చింది.

ఒకడు ఎక్కడా ఉద్యోగం దొరక్క ఓ సర్కస్ కంపెనీకి వెళ్ళాడుట వాళ్ళతడికి సింహం తోలు కప్పి సింహంలా నటించమని శిక్షణ ఇచ్చి దానికి బోనులోకి పంపారుట అయితే అప్పటికే బోనులో ఉన్న మరో సింహాన్ని చూసి అతడు గడగడ వణికి పోసాగాడుట అప్పుడు బోనులోని సింహం— "భయపడకు బాబూ—నేనూ నీలాంటి వాడినే—" అన్నదట

* * *

ఓ రెండేళ్ళలో అధికార పక్షంలో నాకు చెప్పుకోదగ్గ స్థానం లభించింది. నా తంత్రం ఆ యంత్రం ఫలించడమే కాక రాజకీయ రంగంలో నాకు భూపతి వంటి పేరే ఉన్నది.

ఎప్పుడైనా కొత్త నాయకుడు పుట్టి కొత్త పార్టీని పెట్టి, కొదమసింగమై గర్జిస్తే—ఓ సారి నా కథను గుర్తుతెచ్చుకుని—ఆ తర్వాత మరిచిపోండి !

సందేహాలు

